ప్రజాశక్తి

బుధవారం 16 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జివిఎంసిలో..
'కొనుగోళ్ల రాజకీయం'

- 19న అవిశ్వాసం
- హోల్ 'సేల్'గా కార్పొరేటర్లకు గాలం వేస్తున్న కూటమి, వైసిపి
- సిపిఎం, సిపిఐ ఓటింగ్‌కు దూరం...
- పాలనకు తూట్లు
- కమిషనర్ నియామకం ఇప్పట్లో లేనట్టే!



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రస్తుత మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ గొలగాని హరివెంకటకుమారి (వైసిపి)పై టిడిపి, జనసేన, బిజెపి కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఇన్‌ఛార్జి కమిషనర్ అయిన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు ఇచ్చిన సంగతి తెలిసిందే. విశాఖ నగరంలో లక్షల మంది ప్రజల్లో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, జివిఎంసిలో ఆర్థిక బేరసారాల 'రాజకీయం'పైనా అంతటా చర్చ జరిగి ఈ పార్టీల తీరుపైనే అవిశ్వాసాన్ని ప్రకటించే పరిస్థితులకు భవిష్యత్తులో దారితీసే అవకాశం లేకపోలేదన్నది సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలు, నగరంలో పౌరులు ఆవేదనలను ఏ మాత్రం పట్టించుకోకుండా అధికారంలో ఉన్న కూటమి నేతలు స్థానిక సంస్థల్లో అధికారమే పరమావధిగా రూ.కోట్లను మంచినీళ్ల మాదిరి వెచ్చిస్తూ అందరినోటా పడుతున్నారు. దీంట్లో వైసిపి ఏమీ తక్కువ తినలేదు. తమవైపు కార్పొరేటర్లను తిప్పుకోడానికి సైతం వారూ రూ.లక్షలు ఇవ్వజూపడం తాజా పరిణామం. కూటమి అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి ఆ పార్టీలు చేసే ప్రయత్నాలు నెగ్గుతాయా? లేదా అన్నది మేయర్ కాగోరే అభ్యర్థి పెట్టే రూ.లక్షల ఖర్చుపైనే ఆధారపడి ఉందన్నది తెలుస్తోంది.

మునుపెన్నడూ లేని జుగుప్సాకర రాజకీయం

జివిఎంసిలో గతంలో ఎన్నడూ చూడని రీతిలో కార్పొరేటర్లను 'హోల్‌సేల్'గా కొనుక్కునే ప్రక్రియకు అధికార కూటమి, వైసిపి సన్నద్ధమయ్యాయి. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా టిడిపి, జనసేన, బిజెపి సహా వైసిపి రంగంలోకి దిగిపోయాయి. ఒకవైపు మలేషియా, సింగపూర్ వంటి విదేశీ విహార యాత్రల్లో కూటమి పార్టీకి చెందిన నేతలంతా విహరిస్తూనే మరోవైపు బేరసారాల్లోనూ ఫోన్లలో నిమగ్నం అవుతున్నారు. సంతల్లో పశువులు మాదిరిగా వైసిపి కార్పొరేటర్లు కూటమికి లొంగిపోవడం ఒకటైతే సొంత పార్టీ అభ్యర్థిని మేయర్ పీఠం ఎక్కించడానికి సైతం టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన కార్పొరేటర్లు బేరసారాలకు దిగడం కనిపిస్తోంది. జివిఎంసి మేయర్ స్థానానికి అభ్యర్థి అయిన మిగతా 2లో..

అవిశ్వాసానికి సిపిఎం, సిపిఐ దూరం

ఆయా పార్టీల జిల్లా కార్యదర్శుల వెల్లడి

సమావేశంలో పాల్గొన్న జగ్గునాయుడు, పైడిరాజు, స్టాలిన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్‌పై టిడిపి, జనసేన, బిజెపి కూటమి కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం సమావేశం, ఓటింగ్‌లో సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె స్టాలిన్ పాల్గొనకూడదని ఆయా పార్టీల జిల్లా కమిటీలు నిర్ణయించినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె స్టాలిన్ తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, మేయర్, ఉప మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ప్రతిపాదించే అభ్యర్థులను గానీ, వైసిపినిగానీ బలపర్చకూడదని కూడా తమ పార్టీలు నిర్ణయం తీసుకున్నాయని చెప్పారు. ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. పట్టణ సంస్కరణలను రాష్ట్రంపై బలవంతంగా రుద్ది ఆస్తి పన్నుల పెంపు, విద్యుత్తు ప్రైవేటీకరణకు పూనుకుందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తుందని తెలిపారు. టిడిపి, జనసేనలు బిజెపితో కలిసి కూటమిగా కొనసాగటం, రాష్ట్రానికి ముఖ్యంగా విశాఖ జిల్లాకు తీవ్ర నష్టమన్నారు. కూటమిని అడ్డుపెట్టుకొని ప్రశాంతతకు మారుపేరైన విశాఖలో బిజెపి మత వైషమ్యాలు సృష్టించి, ప్రజల మధ్య విభజనకు, ఘర్షణలకు ప్రయత్నం చేస్తోందని తెలిపారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో విశాఖ పెద్ద ఎత్తున లూటీ అయిందన్నారు. ప్రజలపై తీవ్ర పన్ను భారాలు మోపారని, ఆస్తి విలువ ఆధారంగా పన్ను తీసుకురావడం, ఏటా 15 శాతం ఆస్తి పన్ను పెంచే విధానాన్ని అమలు చేయడం, చెత్తపై యూజర్ ఛార్జీలు విధించడం, పౌర సేవలు ప్రైవేట్ వారికి ధారాదత్తం చేయడంతో పాటు జివిఎంసిని పూర్తిగా అవినీతిమయం చేశారని తెలిపారు.

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా నిస్సిగ్గుగా పార్టీలు మారటం, లక్షల రూపాయలు ఇచ్చి కార్పొరేటర్లను టిడిపి, జనసేన, బిజెపి కూటమితో పాటు వైసిపి కొనుగోలు చేయడం నీతి బాహ్యమైన చర్యగా భావిస్తున్నామన్నారు. వారి కార్పొరేటర్లను కాపాడుకోవడం కోసం ఆ పార్టీలు విదేశీ టూర్లకు తీసుకెళ్లి.. విలాసాలకోసం గత 20 రోజుల నుంచి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రాజకీయ విలువలను నిలువునా పాతరేస్తున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు. అటువంటి మిగతా 2లో..

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె మే 20కి వాయిదా

▶ వార్త మెయిన్‌లో..

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి : సిఐటియు

▶ వార్త 8లో..

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

▶ వార్త 2లో..

రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని
ఉపసంహరించాలి

ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

వార్తలు 8లో..

నిర్వాసిత సమస్యలు జటిలం

- టిడిఆర్ జారీకి వ్యతిరేకత
- పట్టించుకోని ప్రభుత్వం
- అనధికార బాణసంచా తయారీ
- లోపించిన పర్యవేక్షణ
- చెరుకు రైతుకు ఇవ్వని బకాయి
- నేడు జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశంలో తమ సమస్యలు చర్చకు వస్తాయని నిర్వాసితులు, చెరకు రైతులు రోడ్డు విస్తరణ బాధితులు ఆశిస్తున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరగనుంది. నక్కపల్లి మండలంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకుండానే స్వాధీనం చేసుకొని పనులు ప్రారంభించడంపై బాధితులు పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో నిర్వాసితుల సమస్య జటిలమవుతోంది. జిరాయితీ భూములకు పరిహారమిచ్చి, కొబ్బరి చెట్లకు రూ.5 వేలు చొప్పున చెల్లిస్తామని రూ.1500లోపే చెల్లించారు. డి పట్టా భూముల్లో చెట్లకు పరిహారం ఇవ్వలేదు. సాగుదారులకు పైసా పరిహారం ఇవ్వలేదు. భూములు పోగొట్టుకున్న వారికి పరిహారం చెల్లింపు సమస్య పరిష్కారంకాకుండానే, తరలింపు గ్రామాల ఇళ్లకు పరిహారం సంపూర్ణంగా ఇవ్వకుండానే, మేజర్లను గుర్తించి ప్యాకేజీ ప్రకటించకముందే ఆర్సెల్లార్ మిట్టల్, బల్క్ డ్రగ్ పార్కుకు ప్రభుత్వం భూములు కేటాయించడం వివాదస్పదమవుతోంది. ఈ నియోజకవర్గంలోని కోటవురట్ల మండలం, కైలాసపట్నంలో బాణ సంచా తయారీ ప్రమాదంలో ఇటీవల ఎనిమిది మృతిచెందారు. వీరి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా అందలేదు.

జిల్లాలో అనధికారికంగా 19 బాణసంచా తయారీ కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తించారు. అనధికారికంగా అంతకంటే ఎక్కువగానే నడుస్తున్నాయి. అనుమతులు పొందిన తయారీ కేంద్రాల్లో భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం, అనధికార కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జివిఎంసిలో 'కొనుగోళ్ల రాజకీయం'

పీలా శ్రీనివాసరావు తనవారు అనుకునే వారిని సైతం తన వైపు తిప్పుకోడానికి, 19న అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేసేందుకు రూ.లక్షలు చెల్లించక తప్పకపోవడం ఇక్కడ గమనించదగినది. పూర్తి ధనమయంగా జరుగుతున్న ఈ అవిశ్వాస తీర్మానంతో నగర ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలూ లేకపోవడంతో సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, స్టాలిన్ కూటమి, వైసిపిలో ఎవ్వరినీ బలపర్చకూడదని నిర్ణయించుకోవడం ఆహ్వానించదగిన పరిణామంగా విశాఖ నగర ప్రజలు, మేథావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ లేకపోయినా...ప్రధాన పార్టీలకు పట్టదా?

జివిఎంసి కమిషనర్ నియామకం పట్ల రాష్ట్రంలోని అధికార పార్టీ ప్రాధాన్యతగా తీసుకోకపోవడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. రాష్ట్రంలోని అతిపెద్ద మున్సిపాల్టీ, అన్ని రంగాల్లో తలమానికంగా ఉండే విశాఖకు మున్సిపల్ కమిషనర్‌ను వేయలేకపోవడం ఏమిటి? అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. కాగా జివిఎంసి పరిధిలో 2024 మార్చి తర్వాత నగర పరిధిలో చేసే అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లకు సుమారు రూ.400కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ప్రభుత్వం పెట్టేసింది. కమిషనర్‌ను నియమిస్తే కాంట్రాక్టర్ల నుంచి ఈ ఒత్తిడి పెరగొచ్చని అందుకే ఆ నియామకం పట్ల తాత్సారం చేస్తుందంటూ కాంట్రాక్టర్ల నుంచి వ్యక్తమవుతోంది. కమిషనర్ నియామకం, అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్న ఆందోళన సైతం ప్రధాన కూటమి పార్టీలకు పట్టకుండా తమ అధికార పీఠం తాపత్రయంలో రూ.కోట్లు ఖర్చుచేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ విదేశాల్లో విహరించడానికే సిద్ధపడ్డారు. ఏప్రిల్ నెలాఖరు వరకూ కొత్త కమిషనర్ నియామకం జరిగే అవకాశాల్లేవన్నది తెలుస్తోంది.

అవిశ్వాసానికి సిపిఎం, సిపిఐ దూరం

విలువలు లేని ఈ పార్టీలు, పదవులకోసం, డబ్బు కోసం, స్వలాభం కోసం ఎంత స్థాయికైనా దిగజారుతుంటే ప్రజలకు, విశాఖ నగరానికి ఏం మేలు చేస్తాయని ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలపై పన్ను భారాలు మోపడంలో, పౌర సేవలు ప్రైవేటీకరించడంలో, ప్రజల ఆస్తులు పిపిపి పేర రాజకీయ కాంట్రాక్టర్లకు, ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడంలోనూ ఈ నాలుగు పార్టీల మధ్య ఏమాత్రమూ తేడా లేదన్నారు. వైసిపి తీసుకొచ్చిన దుర్మార్గ ఆస్తి పన్ను విధానాన్ని సమీక్షించి రద్దుచేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ఇప్పుడు వైసిపి విధానాన్నే కొనసాగించడం సిగ్గు చేటు అన్నారు.

ఈ నేపథ్యంలో రాజకీయ రంగంలో విలక్షణమైన విలువలకు కట్టుబడి, నీతి, నిజాయతీ, నిస్వార్థంగా, నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఐ, సిపిఎం ఈ అవినీతి, స్వార్థ మేయర్ రాజకీయ క్రీడలో పాల్గొన వని, ఏ పార్టీని బలపర్చవని స్పష్టంగా తెలిపారు. కార్పొరేటర్లను అవినీతి సరుకులుగా మార్చి, రాజకీయాలను పూర్తిగా అవినీతి మయం చేసి భ్రష్టు పట్టిస్తున్న టిడిపి కూటమి, వైసిపి పార్టీలను తిరస్కరించాలని విశాఖ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిర్వాసిత సమస్యలు జఠిలం

వైఫల్యం కన్పిస్తోంది. ఎల్‌జి పాలిమర్స్, అసెన్షియా ఫార్మా కంపెనీలో మృతుల కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షలు చొప్పున ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాయి. బాణ సంచా తయారీ కేంద్రంలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించడం విమర్శలకు తావిచ్చింది. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు, ఉపాధి కోల్పోయిన వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పిస్తామని నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లు జారీకి చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో నిర్వాసితులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. పరిహారం నగదుగా ఇవ్వకపోతే రోడ్డు విస్తరణకు భూములు ఇచ్చేదిలేదని తెల్చి చెబుతున్నారు.

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో అటవీశాఖ అనుమతులు లభించక పలురోడ్ల పనులు జరగలేదు. తాగునీటి సమస్య అన్ని ప్రాంతాల్లో ఉంది. అనధికార విద్యుత్ కోతలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలు అత్యంత నిరాశజనకంగా ఉన్నాయి. ఇంటర్ మొదటి ఏడాదిలో విశాఖపట్నం జిల్లాలో 34 శాతం, అనకాపల్లి జిల్లాలో 44 శాతం, అల్లూరి జిల్లాలో 46 శాతం, రెండో ఏడాది ఇంటర్‌లో విశాఖపట్నం జిల్లాలో 55 శాతం, అనకాపల్లి జిల్లాలో 61 శాతం, అల్లూరి జిల్లాలో 63 శాతం ఫలితాలు వచ్చాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరాచేసిన రైతులకు గతేడాది, ఈ ఏడాది బకాయిలు చెల్లించలేదు. ఈ సమస్యలపై సభ్యులు ప్రస్తావించి పరిష్కారం చూపుతారని ప్రజలు భావిస్తున్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

మహిళల నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 35వ వార్డు పరిధి వెలంపేట నివాస ప్రాంతాల మధ్య కొత్తగా మద్యం షాపును ఏర్పాటుచేయడం మంచిది కాదని, అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వెలంపేటలో స్థానిక మహిళలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం షాపులు ఏర్పాటుకు ఇష్టమొచ్చిన రీతిలో అనుమతులు ఇచ్చిందని చెప్పారు. నగరంలో ఏ వీధిలో చూసినా మద్యం షాపులు కనిపిస్తున్నాయన్నారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా మద్యం షాపులు ఏర్పాటుకు లైసెన్స్ ఇవ్వడం సరికాదన్నారు. వెలంపేట 35వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నారని, ఈ షాపు ఏర్పాటు చేస్తున్న ప్రదేశానికి నాలుగు అడుగుల దూరంలో శ్రీరామ దేవాలయం, అంగన్వాడి కేంద్రం ఉన్నాయని, వెనుక భాగంలో ప్రభుత్వ పాఠశాల కూడా ఉందని తెలిపారు. ఇటువంటి ప్రదేశంలో మద్యం షాపునకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. సుమారు నాలుగువేల మంది నిరుపేద ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దన్నారు. తక్షణం అనుమతి రద్దు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మీట్ గ్రేట్ ట్రీట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ సిటిజన్స్ వన్డే అవుట్ ప్రోగ్రాం నిర్వహించడం కోసం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వివిధ పెన్షనర్స్ అసోసియేషన్లు కలిసి మంగళవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక పూర్తి రోజు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ రకాల వినోద కార్యక్రమాలతో పాటు సీనియర్ సిటిజన్స్ అందరూ కలుసుకొని వ్యక్తిగత నైపుణ్యాల్ని, అభిరుచులను ప్రదర్శించడం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల కోసం వినోదం, సహవాసం, స్నేహాన్ని పెంపొందించడానికి ఒక రోజు పూర్తిస్థాయిలో సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కన్సర్న్ ఛారిటబుల్ ట్రస్ట్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అల్పాహారం, భోజనం, టీ, కాఫీ, స్నాక్స్ ఉంటాయని వివరించారు. పోటీలో పాల్గొనే వారికి బహుమతులు, లక్కీ డిప్, ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9440156638, 9492348428, 9393949345 నంబర్లను సంప్రదించాలని డాక్టర్ కె.రమాప్రభ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజిటి నిర్వాహకులు డాక్టర్ పి.కెకెజోష్, పెన్షనర్స్ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.సుధాకర్, అప్పారావు, ఎంఆర్‌డి.రాజు, వెంకటరమణ, బాబూరావు, పి.నారాయణమూర్తి, ఎ.మణి, కె.సుశీల, పి.సతీష్ పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు విశాఖపట్నం జిల్లాలో ప్రతిభ కనబర్చిన 5-18 ఏళ్ల లోపు వయస్సు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న బాలలు ఈ ఏడాది జులై 31 తేదీలోగా http:/awards.gov.inద్వారా దరఖాస్తులను పంపించాలని సూచించారు. కేంద్రం నియమించిన కమిటీ ద్వారా పరిశీలించి, ఎంపిక కాబడ్డ బాలలకు న్యూ ఢిల్లీలో 2026, జనవరిలో రాష్ట్రపతి చేతులు మీదుగా బహుమతితో పాటు, ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందజేయనున్నారని తెలిపారు.

ఏకపక్షంగా జిల్లా ఒలింపిక్ సంఘం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా ఒలింపిక్ సంఘం (విడిసిఎ) ఏకపక్షంగా, క్రీడాకారుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం మంచిది కాదని ఫస్ట్ క్లాస్ మాజీ క్రికెటర్, న్యాయవాది ఎస్‌కె హుస్సేన్ పేర్కొన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఒలింపిక్ సంఘం పాలకవర్గ గడువు 2023తో ముగిసిందని తెలిపారు. అప్పటినుంచి నేటి వరకు ఎన్నికలు జరగలేదన్నారు. కొందరు జిల్లా ఒలింపిక్ సంఘం పేరుతో, వివిధ స్థాయిలో క్రికెట్ క్రీడాకారులను ఎంపిక చేస్తూ, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విశాఖ నగరంలో అన్ని ప్రాంతాల నుంచి క్రీడాకారులు, ఎంపిక పోటీలకు హాజరయ్యే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

మహా భూమి ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన నిర్వహించనున్న మహా భూమి ఉత్సవ్ 2025 పోస్టర్‌ను విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ మంగళవారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా పేరు గాంచిన విశాఖ జిల్లాలో భూమి ధర రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందని తెలిపారు. జిల్లా వాసులకు తక్కువ ధరకు భూమిని కొనుగోలు చేసే అవకాశం మహా భూమి ఉత్సవ్ 2025 ఈవెంట్ ఆర్గనైజర్లు కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA.
I.A. 373/2024 in O.S. 53/2017

Between:
Pilli Nagalingeswara Rao . . . Petitioner/Plaintiff
And:
Vadapalli Bhaskara Raju & Others ..Respondents/Defendants.

NOTICE

To
Respondents No.8 & 9
R-8: Vadapalli Ranjan Raju, S/o late Bhaskara Raju, Flat No.402, SSV Paradise, Near Venkateswara Temple, Seethammadhara, Visakhapatnam.
R-9: Vadapalli Varuna, D/o late Bhaskara Raju, Flat No.402, SSV Paradise, Near Venkateswara Temple, Seethammadhara, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has filed the above interlocutory Applications i.e. I.A.373/2024 in O.S.53/2017 against you to add (1) Vadapalli Ranjan Raju, S/o late Bhaskara Raju and (2) Vadapalli Varuna, D/o late Bhaskara Raju, as Respondents/ Defendants No.8 and 9, who are the legal heirs of deceased 1st defendant, in short and long cause title and for a consequential amendment at all places wherever the place in occurring in the above suit and the same stands posted to **02-05-2025** for your appearance either in person or by a pleader on the above said date at **10.30 A.M.** to answer all material questions. failing which the matter will be heard and determined in your absence exparte as per law.

POTHINA RAMBABU
Advocate, Kailash Nagar, Gajuwaka, Visakhapatnam.
Cell No. 98480 63531

N THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISKHAPATNAM
O.S.309/2024

Between:
Pasila Durga Prasad Rao ...Plaintiff
And:
Nelli Suri Babu ...Defendant

NOTICE

To
Sri Nelli Suri Babu, S/o. N. Nagaraju, D.No. 40-56-46/35, Tatichetlapalem, Visakhapatnam, Now Residing at D.No. 40-51-20/19, Santosh Nagar, Visakhapatnam - 530024.

Whereas the above-named plaintiff instituted the above suit against you and the same stands posted to **17-06-2025** for your appearance, you should appear before the afore said Honourable court at **10:30 AM on 17-06-2025** either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence.

BY ORDERS OF THE HONOURABLE COURT,
B. UMA MAHESWARA RAO,
Advocate,
Flat No. 202, Door No. 53-41-46/1, Sai Sravanthi Towers, K.R.M Colony, Visakhapatnam - 530013, Mobile: 9848654522.

ఉద్యోగులకు హెచ్‌ఎస్‌ఎల్ బీమా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) తన కాంట్రాక్టు, వేతన ఉద్యోగుల సంక్షేమం కోసం న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌తో సమగ్ర గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జిపిఎ) బీమా పాలసీని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఎల్ సిఎండి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, రెగ్యులర్ ఉద్యోగులతో పాటు 2,500 మంది కాంట్రాక్టు కార్మికులు, అప్రెంటిస్‌లు, ట్రైనీలు ఈ పథకంలో భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు. పనిప్రాంతంలో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరికీ రూ.20 లక్షలు బీమా లభిస్తుందని, ఉపాధి రకంతో సంబంధం లేకుండా హెచ్‌ఎస్‌ఎల్‌లో పనిచేసే ప్రతి ఒక్కరికీ రక్షణ లభిస్తుందని వివరించారు.

పత్రికా ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, చాకిపల్లి, గ్రామ కాపురస్తులు పంగ అప్పారావు కుమారుడు పంగ రవికుమార్, విశాఖపట్నం అర్బన్, 5వ పోలీస్ స్టేషన్ దరి, సాయిరామ్ నగర్, మంచు కొండ గార్డెన్స్, డోర్. నెం: 37-5-44/1 నివాసి అంగూరు వేంకటప్పన్న గారి కుమారుడు అంగూరు నారాయణరావు మరియు విశాఖపట్నం అర్బన్, మల్కా పురం, ASSR కాలనీ D.No-71/31/1074 నివాసి సంజీవి అప్పలస్వామి కుమారుడు సంజీవి జోగారావు వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్ మంది ప్రజానీకానికి తెలియజేస్తు ఎవ్వరి కైనా ఈ క్రింది నుదహరించిన విషయం పై వివిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల తే 30-4-2025 ది లోగా స్వయంగా గాని, వ్రాత పూర్వకంగా గాని ఈ క్రింది అడ్రస్‌కు తెలియ జేయవలసినదిగా పత్రికా ప్రకటన చేయుచున్నాము.

పైన పేర్కొన్న నా క్లయింట్లు, విశాఖపట్నం అర్బన్ GVMC లాసన్స్ బేకాలనీ డోర్. నెం: 4-69-4 కాపురస్తుడు అమ్మనమంచి సాంబయ్య కుమారుడు అమ్మనమంచి సీతారామాంజనేయులు ద్వారా తే.30-08-1986 దిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్, విశాఖపట్నం డాక్యుమెంట్ నెంబర్ 7576/1986 ద్వా రా VSP టీచర్స్ కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ దగ్గర క్రయము పొంది, తన యావదాస్తికి తే.10-3-2017 దిన రిజిస్టర్ వీలునామా డాక్యుమెంట్ నెంబర్ 157/2017 వ్రాసి, తే09-08-2017దిన కాలం చేసి యున్నారు, తదుపరి వారసులులో కొంత మంది విదేశాలలో ఉన్న కారణంగా తే 31-8-2018 దిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ అమ్మనమంచి వెంకట సాంబశివశాస్త్రి S/o అమ్మనమంచి సీతా రామాంజనేయులు పేరున డాక్యుమెంట్ నెంబర్ 6452/2018గా తే 31-8-2018 దిన వ్రాయబడి మరల పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ నెంబర్ 1861/2025 ద్వారా తే 17-1-2025 దిన రద్దు గావించబడి పైన ఉదహరించిన వీలునామా వారసులందరు కలిసి అమ్మనమంచి సీతా రామాంజనేయు గారి పెద్ద కుమారుడు అమ్మనమంచి సాంబశివ శాస్త్రి వారి పేరున ఈ క్రింద ఉదహరించిన షెడ్యూ ల్ ఆస్తికి తే 17-1-2025 దిన రిజిస్టర్డ్ సెటిల్ మెంట్ డీడ్ 1863/2025 వ్రాసి తద్వా సంక్రమించంగా, సదరు మొత్తం వ్యవహారాన్ని అన్ని డాక్యు మెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి, వారి (అమ్మనమంచి సాంబశివ శాస్త్రి) దగ్గర క్రయం పొంద దలచినాము. గావున సదరు ఈ క్రింది నుదహరించిన షెడ్యూల్ ఆస్తికి సంబంధించి వివిధమైన అభ్యంతరములు, ఉన్న ఎడల ఈ ప్రకటన **తే.16-4-2025 ది నుండి పదిహేను దినముల వ్యవధి అనగా తే 30-4-2025 ది** లోగా తెలుపవలసినదిగా ఈ ప్రకటన ద్వారా ఆహ్వానించట మైనది.

షెడ్యూల్

విశాఖపట్నం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్, మధురవాడ గ్రామం, టీచర్స్ లే అవుట్ సర్వే నెం. 2, L.P NO. 2/85, వుడా అప్రూవ్డ్ లేఅవుట్, ప్లాట్ నెం. MIG-186,

తూర్పు-పడమరలకు : 70 అడుగులు లేక 21.40 మీటర్లు **ఉత్తర-దక్షిణాలకు :** 40 అడుగులు లేక 12:20 మీటర్లు. (311 స్క్వేర్ యార్డ్స్ లేక 260 స్క్వేర్ మీటర్స్,) కొలతలు గల ఖాళీ స్థలమునకు హద్దులు

తూర్పు - ప్లాట్ నెం .185,
దక్షిణ - ప్లాట్ నెం. 207
పడమర - ప్లాట్ నెం 187,
ఉత్తర - రోడ్డు.

వా. శ్రీనివాసరావు,
అడ్వకేట్,
డోర్ నెంబర్ 4-251, జగన్నాథపురం, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా,
సెల్: 95535 44677.

ఎస్ఐల కొరతతో సేవలకు ఇబ్బంది

పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్

- నాలుగింట రెండు పోస్టులు ఖాళీ
- ఉన్న వారిపై పని భారం, ఒత్తిడి

ప్రజాశక్తి-మధురవాడ : నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐల కొరత వేధిస్తోంది. ఈ స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది, ఈ నేపథ్యంలో నాలుగు ఎస్ఐ పోస్టులు ఉండగా, ఏడాది కాలంగా నుంచి ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వారిపై పని ఒత్తిడి పెరిగి కేసుల దర్యాప్తులో జాప్యం జరుగుతోంది. ఆయా ప్రాంతాల పరిధిలో బీట్లు, రాత్రి గస్తీ, నేరస్థుల కదలికలపై నిఘా, మరోవైపు కోర్టు బెయిల్ తదితర వాటిపై ఆరా తీయాల్సి ఉంది. అత్యవసర కేసుల్లో క్షణాల్లో ఘటనా స్థలాలకు చేరుకోవాలి. మరోవైపు అదృశ్యం, ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో పూర్తి దర్యాప్తు చేయడం న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేయడం, వాయిదాలకు హాజరుకావడం వంటివి విధుల్లో భాగంగా నిర్వర్తించాల్సి ఉంటుంది.

పోలీసు స్టేషన్‌లో విధులతో పాటు బందోబస్తు, ఉత్సవాలు, క్రికెట్ మ్యాచ్‌లు, ఇతరత్రా ప్రత్యేక సందర్భాల్లో ఎస్ఐల ఆధ్వర్యంలోనే పోలీసులు భద్రత కల్పించాల్సి ఉంటుంది. దీంతో స్టేషన్‌లో ఎస్ఐ పోస్టుల ఖాళీతో ఉన్న ఇద్దరు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఇద్దరిలో ఒకరు మహిళా ఎస్ఐ అయినప్పటికీ, ఆమె కూడా రేయింబవళ్లు విధుల్లో ఉండక తప్పనిస్థితి. పిఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి, విస్తీర్ణం ఎక్కువగా ఉండడం, నగర శివారు ప్రాంతాలు కావడంతో నేరాల రేటు ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ఉన్న పోలీసులపై పని ఒత్తిడి లేకుండా తగు చర్యలు చేపట్టి, పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పిఎంపాలెం పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్ఐలకుగాను ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో కేసుల ఛేదన, శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర విషయాల్లో కొంత ఇబ్బందిగా ఉంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలో భర్తీ చేసే అవకాశముంది.

ఎస్.అప్పలరాజు, ఎసిపి, నార్త్ జోన్

నేరాలు ఘోరాలు

గుండెపోటుతో దివీస్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ల్యాబొరేటరీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం, ముక్కాముల గ్రామానికి చెందిన వేంద్ర మధుమోహన్ (24) గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం అర్ధ రాత్రి దాటాక చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. దివీస్ కంపెనీలో మధుమోహన్ రెండేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2.30గంటలకు డ్యూటీకి వెళ్లిన ఆయన, రాత్రి 11.15 గంటలకు విధులు ముగించుకుని దివీస్ హాస్టల్‌కు వెళ్లాడు. స్నానం చేసిన తర్వాత హాస్టల్ ఆరు బయట మొబైల్ లో మాట్లాడుతూ హాస్టల్‌లోని అతను ఉంటున్న రూమ్ బయట తలుపు వద్ద కుప్ప కూలిపోయాడు. అపస్మారక స్థితిలో మధుమోహన్ పడిఉండడాన్ని తోటి ఉద్యోగులు గమనించి, వెంటనే పరిశ్రమ లో ఉన్న డిస్పెన్సరీ కి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి- సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయిన ఘటన చోటు చేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అక్కయ్యపాలెం అబిద్‌నగర్ వద్ద ఒక వ్యక్తి స్పృహ తప్పి పడిఉన్నట్లు స్థానికులు సమాచారం మేరకు నాలుగో పట్టణ పోలీసులు స్పందించి, బాధితుడిని విశాఖ కెజిహెచ్‌కు చికిత్సకు తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వయసు 45 -50ఏళ్లు ఉంటుందని, ఇతర వివరాలు తెలియాల్సిఉందన్నారు.

8 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -రావికమతం:అక్రమ గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 8కేజీల గంజాయిని తమిళనాడుకు చెందిన ఇరువురు వ్యక్తులు రావికమతం శివారులో పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో తొమ్మిది మందికి జరిమానా

ప్రజాశక్తి-మధురవాడ: పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మంది వాహనదారులకు కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సిఐ నల్లి సాయి తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిందితులను సెకెండ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.11వేలు వరకు తొమ్మిది మందికి రూ.92 వేలు అపరాధ రుసుము విధించారని సిఐ సాయి తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సిఐ సాయి హెచ్చరించారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - పెందుర్తి: విశాఖపట్నం నగర పరిధిలో మోటారు సైకిళ్ళు దొంగతనాలకు పాల్పడుతున్న అంపోలు కిషోర్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు క్రైమ్ డిసిపి లతామాధురి వెల్లడించారు. మంగళవారం పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎడిసిపి మోహన్, ఎసిపి లక్ష్మణ్‌లతో మీడియా సమావేశంలో చోరీ వివరాలను వెల్లడించారు. సిటీ పరిధిలోని పెందుర్తి, గోపాలపట్నం, ఆనందపురం, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో కిషోర్‌కుమార్ 20 మోటార్ సైకిళ్లను దొంగలించి, ఒడిశా రాయగడలో విక్రయించారని తెలిపారు బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెందుర్తి ఎస్ఐ సూరిబాబు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టి నిందితున్నిఅరెస్టు చేసినట్లు వెల్లడించారు దొంగ మోటార్ సైకిళ్లను కొనుగోలు చేసిన ఒడిశా వాసులు కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన సిబ్బందిని సిటీ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించినట్లు డిసిపి తెలిపారు.

ధాన్యపు గుత్తుల ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పొట్టి శ్రీరాములు, శాఖ గ్రంథాలయం సమీపంలో పలు పార్కుల్లో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ధాన్యపు గుత్తులను ఏర్పాటు చేశారు. పక్షులకు ఆహారంగా వీటిని ఏర్పాటు చేయడాన్ని పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఆదిత్య, జి వెంకటేష్ , మైలపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని గంధవరం గ్రామదేవత పైడితల్లమ్మ పండగను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామదేవత ఉత్సవానికి వచ్చి మండుటెండలతో అల్లాడిన బంధుమిత్రులతోపాటు స్థానికులకు మజ్జిగ పంపిణీ చేయడంతో ఉపశమనం పొందారు.

70 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేటలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 70 మందికి వైద్యులు డాక్టర్ దివ్య, ప్రశాంత్ కంటి పరీక్షలు చేశారు. 15 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ పైడిరాజు, చంద్రరావు, శర్మ, శివ పాల్గొన్నారు

జివిఎంసి చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్, ఒకటి నుంచి నాలుగు వార్డుల్లో 14 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎఇ జి.సురేష్ తెలిపారు. వేసవిలో. ఏప్రిల్, మే, జూన్ వరకు కొనసాగనున్న ఈ చలివేంద్రాల నిర్వహణకు జివిఎంసి రూ.9 లక్షలు కేటాయించింది. ఒక్కో చలివేంద్రం నిర్వహణకు మూడు నెలల కు రూ 64,200 వేలు ఖర్చు చేయనుండగా, వీటి వద్ద తాత్కాలికంగా నియమించిన వ్యక్తికి రోజుకు రూ 730 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.1,4వార్డుల్లో మూడేసి,2,3 వార్డుల్లో నాలుగేసి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎఇఇ సురేష్ తెలిపారు.

'బెహరా'కు సముచిత స్థానం

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : వైసిపిని వీడి జనసేనలోనికి వచ్చిన బెహరా భాస్కరరావుకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచకర్లను తన అనుచరులతో బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బెహరా భాస్కరరావు తనకు చిరకాల మిత్రుడని, ఎప్పటి నుంచో జనసేనలోనికి రమ్మని ఆహ్వానించానని, ఆయన సమయం తీసుకున్నారన్నారు. బెహరా రాకతో కార్పొలేషన్‌లో తమకు బలం పెరిగిందన్నారు.

ఆదర్శ మహిళా రైతులకు సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుతో మొదలు పెట్టి 365 రోజులు ఆదాయం వచ్చే విధంగా ఎటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ సాగుతో అధిక దిగుబడులు సాధించిన ఇద్దరు ఆదర్శ మహిళా రైతులు చందల కృష్ణమ్మ, సిరిపురం నరసమ్మలను మంగళవారం తర్లువాడలో అధికారులు గ్రామ పెద్దలు సన్మానించారు మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతుగా అవార్డు తీసుకున్న కృష్ణమ్మ మాట్లాడుతూ, ఈవిధానంలో సాగుతో 20 సెంట్లు విస్తీర్ణంలో రూ.40వేలు ఆదాయం సంపాదించానన్నారు.

మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం సాగును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. టిడిపి నేత తాత్రాజు అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర, డిమాండ్ ఉందన్నారు. .జిల్లా ఎన్ఎఫ్ఎ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ఈ విధానంలోసాగుపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో పొందుపరిచిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ధనుంజయరావు మండల మోడల్ మేకర్ రామారావు, యూనిట్ ఇన్‌ఛార్జి పైడిరాజు పాల్గొన్నారు

తర్లవాడలో మహిళా రైతులను సత్కరిస్తున్న అధికారులు

ఆంధ్రా టు ఆంధ్రా.. వయా తెలంగాణ

- ఇదీ విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి
- స్వీయ అనుభవాన్ని సోషల్ మీడియాలో కేంద్రమంత్రికి ట్యాగ్ చేసిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ : ఆంధ్రా టు ఆంధ్రా.. వయా తెలంగాణ.. అంటూ ఫేస్‌బుక్ ఖాతాలో కేంద్ర పౌరవిమానాయన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒక పోస్టును టాగ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి పరిపాలన రాజధాని అమరావతి చేరాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి రావడం బాధాకరమని, మంగళవారం ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చిన తాను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశానిఇకి అమరావతి వెళ్లేందుకు విమానంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుని, అక్కడినుంచి విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యిందని తన స్వీయఅనుభవాన్ని ట్యాగ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశానికి విశాఖ నుంచి బయలుదేరిన సిఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా తనలాగే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకున్నారని పోస్ట్‌లో పేర్కొన్నారు.

. విశాఖ - విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని, మంగళవారం కావడంతో వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విశాఖ నుంచి విజయవాడ చేరాల్సి వచ్చిందని అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా తన అనుభవాన్ని పంచుకొన్నారు. ఇదీ విశాఖ విమాన ప్రయాణీకుల దుస్థితి అని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు కూడా ట్యాగ్ చేసారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పౌష్టికాహారం, వ్యక్తిగత, రిసరాల పరిశు భ్రతపై అంగన్వాడీ కేంద్రంలో గల తల్లులకు అవగాహన కల్పించారు. సిడిపిఒ ఎం. శ్రీదేవి మాట్లాడుతూ,. చిన్నారులకు పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పతివాడ వెంకటరత్నం, కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు

రాయితీపై మినుము, పెసర విత్తనాలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని వేసవిలో ఆరుతడి పంటల కింద సాగుకు మినుములు, పెసర విత్తనాలు 50శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బివి.చలం తెలిపారు. అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న ఆ రైతు కేంద్రాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా పోలమాంబ జాతర

ప్రజాశక్తి - ఆరిలోవ: ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, ప్రాంతాల్లో వెలసిన పోలమాంబ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులకు మజ్జిగ, పులిహోర, మంచినీరు పంపిణీ చేసారు. 9వ వార్డు కొండవాలు సింహగిరి కాలనీలో, పెదగదిలి, చినగదిలి, ఆరిలోవ కాలనీ ప్రాంతాల్లో వీధులన్నీ పండగ వాతావరణం నెలకొంది. .రహదారులన్నీ విద్యుత్ అలంకరణలతో ధగధగలాడాయి

రక్తి కట్టించిన 'భక్త ప్రహ్లాద'

భక్త ప్రహ్లాద నాటకంలో ఓ సన్నివేశం

ప్రజాశక్తి -మాధవధార : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆర్థిక సాయంతో స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద పౌరాణిక పద్యనాటకం రక్తి కట్టించింది. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులతోపాటు స్థానికుల విజ్ఞప్తి మేరకు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఈ నాటక ప్రదర్శన నిర్వహించారు. బగాది విజయసారథి, బగాది విజయ్ సాయి దర్శకత్వంలో జాహ్నవి లక్ష్మి అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కవులు, కళాకారులు, క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు విశాఖ పోర్టు యాజమాన్యం ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యఅతిథి గంటా అప్పలనాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎన్ కనకారావు, జరగడం సత్యనారాయణ, పులి శివప్రకాష్ రావు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు.

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన గోపాలపట్నం, మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే గణబాబు తన క్యాంప్ కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభివృద్ధి పరిచారని, అది ఫలితాల్లో ప్రస్ఫుటంగా కనిపించిందని, అనేకమంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూముల ఆక్రమణ ?

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన స్థలాల్లో నిర్మాణాలు

హెచ్చరిక బోర్డు స్థలాల్లో చేపడుతున్న నిర్మాణాలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు బాలచెరువు గ్రామంలో మిగులు ఉన్న స్టీల్‌ప్లాంట్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ భూమి విలువ విపరీతంగా పెరగడంతో ఆక్రమణలు జోరందుకున్నాయి ఒక్కో ఇంటిస్థలం విలువ రూ.40 లక్షల వరకు పలుకుతుండడంతో ఆక్రమణదారుల కన్ను స్టీల్‌ప్లాంట్ మిగులు భూములపై పడింది. గతంలో ఎస్‌డిసి, ఇతర అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులను సైతం పక్కన బెట్టి దురాక్రమణకు పాల్పడుతూ నిర్మాణాలను చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకుండా, ఈ ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ భూములన్నీ కబ్జాదారుల పరం కావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతను వివరణ కోరగా, దీనిపై పరిశీలన జరిపి, తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు

జెఎసి సమావేశంలో పాల్గొన్న జగ్గునాయుడు, తదితరులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్లాంట్‌లో తొలగింపులు ఆపాలంటూ విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో జెఎసి సమావేశం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు బి.నాగభూషణం (ఐఎన్‌టియుసి), ఎం.మన్మథరావు (ఎఐటియుసి), ఎస్.కనకారావు (సిఎఫ్‌టియుఐ), దేవా (ఎపిఎఫ్‌టియు) మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11440 కోట్ల ప్యాకేజీ ఇచ్చిందని, ప్లాంటు మునుగడకు ఏ ఇబ్బంది లేదని చెబుతూ, టెండర్లు అయిపోయాయనే పేరుతో 600 మంది కాంట్రాక్టు కార్మికులను ఇటీవల నిలిపివేసిందన్నారు. 1503 మందిని తొలగిస్తున్నట్లు లిస్టులో ప్రకటించారని తెలిపారు. ఈ సంవత్సరం చివరకు 5600 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారన్నారు. ఈ అక్రమ తొలగింపులు ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి విడనాడాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్‌లోని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన తలపెట్టిన పోరాటానికి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూ, కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. లేనిపక్షంలో జిల్లాలోని కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాడతామని అన్నారు. కాంట్రాక్టు కార్మికుల నిరసన కార్యక్రమాల్లో తాము కూడా పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, గ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి, విశాఖ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి.జగన్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు వై.రాజు, మత్స్యకార కార్మిక సంఘం అధ్యక్షులు కె.చంద్రశేఖర్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్‌ఎన్. రాజు, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్ యూనియన్ నాయకులు కెవిజె.రావు, ఎపి మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్‌నాయకులు కెవిపి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ మద్దతు

ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంటాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలన్న డిమాండ్‌తో తలపెట్టిన పోరాటానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం కూర్మన్నపాలెం దీక్షాశిబిరం వద్ద ఈ మేరకు పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్‌రామారావు మీడియాతో మాట్లాడారు. సమావేశంలో వంతులు శ్రీను, డేవిడ్, బాబురావు వరసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు చేస్తున్న కుట్రలను తెలియజేశారు.

మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలి

- సొంత నిధులతో విశాఖ పోర్టు ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి
- 197వ రోజు నిరసన దీక్షలో యూనియన్ నేత జగన్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేసి, వైద్యసేవలను మెరుగుపరచాలని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.జగన్ అన్నారు. పిపిపి విధానంలో అభివృద్ధి పేరుతో పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా ఆసుపత్రి ఎదుట చేపడుతున్న 197వ రోజు నిరసన దీక్షలో మాట్లాడుతూ 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్యాలతో వ్యాపారం చేయాలని మోడీ ప్రభుత్వం ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల పోర్ట్ స్టేడియం స్థలంలోనే ప్రయివేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో నిర్లక్ష్యం కారణంగా ఒక బాలుడు దుర్మరణం పాలయ్యాడన్నారు. అదే పోర్టు ఆసుపత్రికి ప్రైవేటుకు కట్టబెడితే, లాభాల వేటలో వారు ఎంతమంది ప్రాణాలతో ఆడుకుంటారో కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. తక్షణమే పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరారు.పోర్టు ఉద్యోగులు దీక్షలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కె సత్యనారాయణ, జె సత్యనారాయణ, కెఎస్.కుమార్, జిసిహెచ్ నాయుడు, శంకర్, శ్రీను, భాస్కర్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంబాబు, తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 19న విశాఖలో నిర్వహించే రైల్వే వ్యాగన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైల్వే వాగన్ వర్క్‌షాప్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. రాష్ట్రసదస్సులో దశలవారీగా రైల్వే ప్రయివేటీకరణకు కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కార్యాచరణతోపాటు, కార్మికులకు నైపుణ్యత ఆధారంగా పనికి తగ్గ వేతనాలను పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయడం ఇతర సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. సిఐటియు జోన్ కార్యదర్శి రైల్వే వాగన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.అవతారం, ప్రధాన కార్యదర్శి వి రాజు, యువి. వెంకటేశ్వరరావు, రామకృష్ణ వెంకటరావు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ వర్తింపజేయాలని ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నేత ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- మాధవధార : రేకులషెడ్ల నుంచి టిడ్కో ఇళ్లల్లోకి నివాసం మార్చిన ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీని కొనసాగించి వర్తింపజేయాలని సిపిఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం కంచరపాలెం విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎఇకి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ కంచరపాలెం 56వ వార్డు దయానందనగర్, ముత్యమాంబ కాలనీ, రాజీవ్ కాలనీ, పైడిమాంబ కాలనీ తదితరప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 200 ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీని ఇచ్చేదన్నారు. గతంలో రేకుల షెడ్లలో ఉన్నప్పుడు ఉచిత కరెంటు రాయితీ ఇచ్చేవారని, అయితే టిడ్కో ఇళ్లల్లోకి మారిన తర్వాత మీటర్లు మార్చడంతో ఉచిత విద్యుత్ వర్తించడం లేదన్నారు. అలాగే చనిపోయిన వారి పేరున ఉన్న విద్యుత్ మీటర్లు పేర్లు మార్పించుకోలేని వారి కుటుంబసభ్యులకు రాయితీ అందడం లేదన్నారు. దీనిపై సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలన జరిపి, గతంలో ఉచిత విద్యుత్ ఇచ్చే వారందరికీ రాయితీని కొనసాగించాలని, అలాగే అర్హులైన ఎస్‌సి,ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ రాయితీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆయా కాలనీల్లోని దళిత, గిరిజనులకు ఉచిత విద్యుత్ రాయితీతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి సౌకర్యాలు అందడం లేదని, దీంతో వీరంతా దుకాణాల్లో, భవన నిర్మాణాలు, పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబపోషణ చేసకుంటున్నారన్నారు. వీరికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.సోమేశ్వరరావు, జోన్ కమిటీ సభ్యులు ఎం.ఈశ్వరరావు, సభ్యులు కె. కుమారి, పి.శారద, జె.వెంకటేష్, ఎల్.రామయ్య, కె.లక్ష్మీ పాల్గొన్నారు,

ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుతో ఆరోగ్యవంతమైన ఫలసాయం

ప్రజాశక్తి- పద్మనాభం : ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుతో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన ఫలసాయం పొందవచ్చని సంబంధిత వ్యవసాయశాఖ ప్రతినిధి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం మద్దిలో గ్రామసభ నిర్వహించారు. ప్రకృతి విధానంలో సాగుచేసిన వ్యవసాయ ఉత్పత్తులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దీనిపై అవగాహన ఉన్నవారంతా ధర ఎక్కువైనా ఇవే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులందరూ అవగాహన కలిగి, ఈ విధానంలో సాగుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించగా, ఇప్పటివరకు ఆరు గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయన్నారు.

జిల్లా పారిశ్రామికాభివృద్ధికి చర్యలు

డిఐఇపిసి సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏక గవాక్ష విధానం కింద ఈ జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ 2177 దరఖాస్తులు వివిధ శాఖల అనుమతి కోసం రాగా వాటిలో 2077 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల అనుమతుల వివరాలను వివిధ శాఖల అధికారులతో మాట్లాడి నిర్ణీత సమయంలో ఆమోదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో 41 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం వచ్చిన 121 దరఖాస్తులకుగాను రూ.12.91 కోట్లకు కమిటీలో ఆమోదం తెలిపామన్నారు. 2024 అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 196 పరిశ్రమలకుగాను 160 పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టామన్నారు. అనంతరం నూతనంగా మంజూరు చేసే స్థలాలపై సమీక్ష చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

సమావేశంలో అనకాపల్లి ఆర్‌డిఒ షేక్.ఆయిషా, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, ఎపిఐఐసి జెడ్ఎమ్ ఎస్.నరసింహారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ముకుందరావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్ పాల్గొన్నారు.

వెదురు సాగుపై మహిళా రైతులకు అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : వెదురు సాగుపై మహిళా రైతులకు స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ మండల అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో వెదురు సాగు వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వెలుగు ఏపీఎం ప్రభాకరరావు మాట్లాడుతూ దేవరాపల్లి మండలంలో ఈ ఏడాది 135 మంది మహిళా రైతులను వెదురు సాగు చేసేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన చిన్న, సన్నకారు మహిళా రైతులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులై ఉండి, 5 ఎకరాల లోపు జిరాయితీ, డి-పట్టా భూమి కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి 30 సెంట్లు సాగు చేసేందుకు 60 మొక్కలు పంపిణీ చేస్తామని, 5 కేజీల వర్మి కంపోస్ట్ ఇస్తామని, ఉపాధి హామీ ద్వారా పని దినాలను కల్పిస్తామని చెప్పారు. ఈ వెదురును ఎక్కడైనా అమ్ముకునేందుకు వీలుగా ఫారెస్ట్ సెటర్డ్ షిప్ కౌన్సిల్ సర్టిఫికేట్ ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మన మిత్ర-ప్రజల చేతిలో ప్రభుత్వం" (వాట్సాప్ గవర్నెన్స్) కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌర సేవలను సులభతరంగా ప్రజలకు అందించడమే వాట్సాప్ గవర్నెన్స్ లక్ష్యమని పేర్కొన్నారు. వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌ను మనమిత్ర పేరుతో నమోదు చేసుకుని హాయ్ అనే సందేశం పంపడం ద్వారా వివిధ రకాల ప్రభుత్వ సేవలను పొందవచ్చని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని డిజిటల్ అరెస్టులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి ఎటువంటి అనుమానం వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని కోరారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను స్మార్ట్‌ఫోన్లోని ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకొని మొబైల్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఆపద సమయంలో పోలీస్ శాఖ వారి సహాయ సహకారాలు పొందగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి ఎస్.మంజులవాణి, నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి ఉదయశ్రీ పాల్గొన్నారు.

మూలపేటలో గ్రామసభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామంలో గ్రామ సర్పంచి బీశెట్టి గంగ అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. గ్రామంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య లోపం తలెత్తకుండా చెత్త బుట్టల పంపిణీతో పాటుగా గ్రామంలో చెత్త నుండి సంపద తయారీని రైతులకు తక్కువ ధరకే విక్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మొల్లేటి గంగాధర్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీ చంద్ర, వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, కాండ్రేగుల నాని, బీశెట్టి నారాయణమూర్తి, ఎల్లపు హైమావతి, వాకపల్లి నూకాలమ్మ, కూటమి నాయకులు ఆడారి జనార్దనరావు, సరగడం నాగేశ్వరరావు, బీశెట్టి నాగేశ్వరరావు, నాగేంద్ర, వెంకట అప్పారావు, విశాఖ డెయిరీ మాజీ అధ్యక్షులు కాండ్రేగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్షంతో రైతన్నలు హర్షం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మంగళవారం వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఏకధాటిగా సుమారు గంటపాటు కురిసిన వర్షానికి పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షం కాయగూరల పంటలు, చెరకు, సరుగుడు, యూకలిప్టస్ వంటి తోటలకు ఎంతో మేలు చేస్తుంది. మామిడి రైతులకు కూడా మేలే జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం కోసం ఇబ్బంది పడుతున్న రైతులకు పచ్చిక పెరిగి పాడి పశువులకు గడ్డి బాగా పెరుగుతుందని చెబుతున్నారు. ఈ వర్షానికి పల్లం భూముల్లో పెసలు విత్తనాలు జల్లుకోవడానికి అనుకూలంగా ఉందని రైతులు భావిస్తున్నారు. ఎండలు ఉక్క పోతలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుండి ఎండతో విలవిల్లాడిన ప్రజానీకానికి వర్షపు చినుకులు ఉపశమనాన్ని కలిగించాయి. మండలంలోని వడ్డాది, బంగారుమెట్ట, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టమాటా రైతులను ఆదుకోవాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు, టమాటా రైతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా టమాటా పండించే రైతులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మార్కెట్ ఏడి కార్యాలయాల్లో ఎపి రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో ఆవ ఖండం, శిరసపల్లి, వల్లూరు, గొర్లివానిపాలెం, గవర్ల అనకాపల్లి, అసకపల్లి గ్రామాల నుండి గతంలో రోజుకు 30 నుండి 50 టన్నుల వరకు టమాటాలు విశాఖపట్నం వివిధ ప్రాంతాల్లో విక్రయించే వారని తెలిపారు అయితే ఇటీవల చిత్తూరు నుండి టమోటాలను దిగుమతి చేసుకొని ఇక్కడి టమాటా లను తిరస్కరిస్తున్నారని, దీని వల్ల ఇక్కడి రైతులు ఎక్కువ నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకొని తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, నాయకులు తేలయ్య బాబు, పొలిమేర గొల్లబాబు, పిళ్లా సూరిబాబు, కర్రి మోహన్, నూకరాజు, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-వడ్డాది : సమాజాభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తుకు జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది తిరుమల ఫంక్షన్ హాల్‌లో జర్నలిస్టుల కృతజ్ఞతా సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. చోడవరం నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని రోలుగుంట, రావికమతం, బుచ్చియ్యపేట చోడవరం మండలాల జర్నలిస్టులందరూ ఐదు సంవత్సరాలనుండి అనేక సందర్భాల్లో మీడియా పరంగా తమకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. తను ఈ స్థాయిలో ఉంటానికి మీడియా అందించిన సహాయ, సహకారాలు ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపిడబ్ల్యూజెయు జాతీయ నాయకులు శరగడం రామకోటి, జిల్లా టీడీపీ యూత్ విభాగం అధ్యక్షులు సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి, వడ్డాది టౌన్ టీడీపీ అధ్యక్షులు దొండా నరేష్ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 17 మంది తరలింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కంటి శస్త్ర చికిత్సల నిమిత్తం 17 మందిని మంగళవారం విశాఖ రీజినల్ ఐ హాస్పిటల్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజ్య మేఘన, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్(పిఎంఒఏ) కె.భవాని, సిహెచ్ఓ ఎం.ఆనంద్, హెచ్ఈఎస్ పుష్పరాజ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : అర్హత గల ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవోగా వై.రుక్మిణీదేవి అన్నారు. ఈ నెల 10న బాధ్యతలు స్వీకరించిన ఆమె గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 27 పంచాయతీల్లో నాలుగు వేల మంది జాబ్ కార్డుదారులు ఉపాధి పనులకు వెళ్తున్నారని తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -దేవరాపల్లి : జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలో డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు సంయుక్తంగా ఈ 5వ తేదీన 12వ జాతీయ చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి 24 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. జి.జీవన్ (8వ తరగతి), జి.జస్వంత్ (9వ తరగతి), జి.కావ్య (7వ తరగతి), ఎం.సింహాద్రి (7వ తరగతి) బంగారు పతకాలు, సాయి సుజన, వై.చంద్రకాంత్, వై జయవర్ధన్ సిల్వర్ పతకాలు సాధించారు. పాఠశాల డ్రాయింగ్ టీచర్ వై.సముద్రం, సోషల్ టీచర్ ఎల్.సత్యనారాయణ సమక్షంలో విద్యార్థులను

బంగారు, సిల్వర్ పతకాలు సాధించిన విద్యార్థులు

విజయవాడకు పంపించారు. గోల్డ్, సిల్వర్ మెడల్స్ పొందిన విద్యార్థులకు ఇన్చార్జి ఎంఈఓ-1, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పడాల్ దాస్, స్కూల్ కమిటీ చైర్మన్ దేవుళ్ళు చేతులు మీదుగా మెడల్స్ సర్టిఫికెట్స్ మంగళవారం అందించారు. గెలుపొందిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ సముద్రంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం డి.శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు ఐజాక్, ప్రసాద్, పిడి బాబూరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ వితరణ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామపంచాయతీకి ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్ సంస్థ సిఇఒ చావా సత్యన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు చేతుల మీదగా మంగళవారం గొర్లెవానిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ గొర్లి గోపి అమ్ములుకు చెత్త సేకరణ ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లారస్ సిఇఒ సత్యన్నారాయణ గ్రామ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ దేవతల గుడులను లారస్ సంస్థ వారు బాగా అభివృద్ధి చేయించారని సర్పంచ్ తెలియజేశారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, వార్డు మెంబర్లు పోలిరెడ్డి అప్పారావు, పైలా అప్పారావు, పంచాయతీ కార్యదర్శి తరుణ, పోలిరెడ్డి వెంకటరావు పాల్గొన్నారు.

పంచాయతీకి ట్రాక్టర్ అందిస్తున్న లారస్ ప్రతినిధులు

రేపు వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో వివిధ పాఠశాలలో చదువుతున్న వికలాంగ (ప్రత్యేక అవసరాలు కలిగిన) విద్యార్థులకు చోడవరం కొత్తూరు జంక్షన్‌లోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఉచిత ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఎపి సమగ్ర శిక్ష, అల్మికో సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నిర్ధారణ శిబిరాల్లో గుర్తించిన 262 మంది విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 9 మందికి బ్యాటరీ ట్రై సైకిళ్ళు, 20 మందికి ట్రై సైకిళ్ళు, 95 మందికి వీల్ చైర్లు, 46 మందికి సిపి చైర్లు, 23 మందికి బ్రెయిలీ కిట్లు, 69 మందికి వినికిడి యంత్రాలు అందజేస్తామని వివరించారు. ఉపకరణాలు తీసుకోబోయే విద్యార్థులు తమ ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

అవార్డు అందుకున్న ట్రస్టు ప్రతినిధి ఎరుకునాయుడు

అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు అవార్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : 2024-25 సంవత్సరంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందించిన ఉత్తమ సేవలకుగాను అమ్మ చారిటబుల్ ట్రస్ట్‌కు అంబేద్కర్ జయంతి సందర్భంగా యూనియన్ బ్యాంక్ వారు అఫిషియేషన్ అవార్డ్‌ను ప్రదానం చేశారు. ఈ అవార్డ్‌ను విశాఖపట్నం జిల్లా యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ షాలిని చేతులు మీదుగా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ దొగ్గ ఎరుకు నాయుడు అందుకున్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, గవర్నమెంట్ హైస్కూల్లో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ, విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం తదితర సేవా కార్యక్రమాలను గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల్లో గత 12 సంవత్సరాలుగా అమ్మ ఛారిటబుల్ ట్రస్టు చేస్తుంది. ఈ సేవా కార్యక్రమాలను గుర్తించి విశాఖపట్నం జిల్లా యూనియన్ బ్యాంక్ వాళ్ళు అవార్డు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు జూరెడ్డి దివాకర్, సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన శ్రీవెంకట లక్ష్మీనారాయణ అన్నమయ్య కోలాట సంస్థ, కర్రి దుర్గావతి, తిరుమల రాజా శైలజ, పాయకరావుపేట, కాకినాడ శ్రీనృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ మ్యూజిక్ డాన్స్ అకాడమీ నృత్యం ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన గ్రంధి లక్ష్మణ్ కుమార్, వాకాడ బాబు, బరిణికాన రాము, నగిరెడ్డి ఈశ్వరరావు ధనలక్ష్మి, లంక లక్ష్మణరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం టీ.ఎస్. శుభ రాజేశ్వరి (ముప్ప) ఆంధ్ర నాట్య కళాకారిణి నృత్యం వీక్షకులను ఆకట్టుకుంది. కళాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకాంబికా దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

డైట్‌లో ఎంబిఎ విద్యార్థుల వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ నేడు ప్రపంచం మొత్తం బిజినెస్ అనే సూత్రం మీద నడుస్తుందని, వివిధ దేశాల మధ్య జరిగే దిగుమతులు, ఎగుమతులకు ఈ వ్యాపార సూత్రాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఎంబీఏ విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ఫైనాన్స్ , మార్కెటింగ్, హెచ్ఆర్ రంగాలలో కీలకమైన పాత్ర పోషిస్తారని తెలిపారు. అనంతరం సీనియర్ విద్యార్థులు ఈ రెండు సంవత్సరాల కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం విద్యార్థుల పాటలు, నృత్యాలు, కేరింతలతోసాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ వీడర్ మంజూరు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోగల చింతపాక గ్రామ రైతు విశారావు కన్నయ్యకు 50 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా పవర్ వీడర్ మంజూరైంది. దీన్ని కూటమి నాయకులు కలిమి శ్రీను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నాని పాల్గొన్నారు

బోర్‌వెల్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో బోర్ వెల్ పనులకు ఎంపిపి చింతల బుల్లి లక్ష్మి మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామంలో పెద్దన్నవారి, బుగిడి వారి కల్లాల వద్ద మండల పరిషత్ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను ఆరంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, పాల సంఘం పిఎస్ లక్కరాజు పెద్దనాయుడు, వార్డు మెంబర్ మారాజు నాగేశ్వరరావు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ మారాజు రాము పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో 16వ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం తూతూ మంత్రంగా జరిగింది. ప్రతిపక్ష వైసిపికి చెందిన ఎంపిపి కావడంతో సమావేశానికి ఎమ్మెల్యే హాజరు కాలేదు. కొన్ని శాఖల అధికారులు పాల్గొనలేదు. కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు కూడా హాజరు కాలేదు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం జరగాల్సిన ఈ సర్వసభ్య సమావేశాన్ని లక్ష్యానికి దూరంగా ముగించేశారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు సమస్యలపై ఏకరవు పెట్టారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలపై సర్పంచులు నిలదీశారు. మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పారిశుధ్య కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడ్డారంటూ ఇక్కడి ఇద్దరు ఎంపిటిసిలు కన్నారావు, చదరం నాగేశ్వరరావుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మరికొందరు బీసీ రుణాలపై మాట్లాడారు. కేవలం టిడిపి కూటమి సానుభూతిపరులకే రుణాలు మంజూరు చేస్తున్నట్టు వాపోయారు. ఎంపీపీ సూరిబాబు సమస్యల పరిష్కారానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తున్నట్టు నామ మాత్రపు ప్రకటన చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో నరసింహారావు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి, వైస్ ఎంపీపీ సూర్య కుమారి, ఆనందరామ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

సమావేశంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా కోటాలో 33శాతం బీసీలకు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అనకాపల్లి విజయ రెసిడెన్సీలో జరిగిన సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగలరావు, రాష్ట్ర కన్వీనర్ అవుల నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్ పునరుద్ధరించాలని కోరారు. బీసీ కులానికి చెందిన వాడిననే చెప్పుకొనే దేశ ప్రధాని బీసీల కోసం ఈ 11 సంవత్సరాల్లో ఏమి చేయలేదన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులలో ఓబీసీలు ఒక్క శాతం కూడా లేకపోవడం శోచనీయమన్నారు. మూడు ఐదు శాతం ఉన్న వాళ్ళు గడిచిన 75 సంవత్సరాలుగా రాజ్యాధికారం అనుభవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 65 శాతం పైగా ఉన్న బీసీలు చట్ట సభలలో చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా మొల్లి సన్ని బాబును నియమించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోయిన భానుమూర్తి యాదవ్, కిల్లాడ అప్పల రాజు, రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు, జిల్లా బీసీ నాయకులు జి అప్పారావు, రెడ్డి రాము, చల్లా నానాజీ, యువజన బీసీ దాలి బోయిన గోవింద్, బి.బాల మురళీ, సారిపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే బిడ్డల ఆరోగ్యం క్షేమం

ప్రజాశక్తి-అనకాపల్లి : పౌష్టికాహారంతోనే బిడ్డల ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని జిల్లా మహిళా సంక్షేమ శాఖ పిడి కె.అనంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎన్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాస్థాయి పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 8 నుండి 22 వరకు నిర్వహించిన పోషణ పక్వాడలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గర్భం దాల్చిన స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సబ్బవరం సిడిపిఓ వి.లలిత కుమారి మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తగిన మోతాదులో అందించడం ద్వారా మెదడు మెరుగుపడుతుందని చెప్పారు. గర్భిణీ స్త్రీలు పలు వ్యాయామాలు చేయడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, పిల్లలు ఎదుగుదలకు మేలు చేస్తుందని తెలిపారు. జిల్లా పీడీ ప్రభావతి మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పౌష్టిక ఆహారం విషయమై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌వి పి.రాములమ్మ మాట్లాడుతూ గర్భం దాల్చిన స్త్రీలు ఒత్తిడి తగ్గించుకుని జీవించడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. శక్తి యాప్ ప్రయోజనాలను వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, పిల్లలకు అన్న ప్రాసన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు రకాల పిండివంటల ఎగ్జిబిషన్‌ను అధికారులు, ప్రజలు తిని తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ చంద్రదేవ్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ శిరీష, నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, సూపరింటెండెంట్ పద్మకళ, సీనియర్ అసిస్టెంట్ ఎమ్‌డి మొహిద్దీన్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ వై రాజు, కిరణ్, జ్యోతి, డీసీబీ, ఓఎస్సీ సిబ్బంది, అంగన్వాడి, ఆశాలు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధి నరసింగపల్లి సబ్ స్టేషన్ తాళ్లపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కశింకోట ఇఇ రామకృష్ణ మంగళవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, ఎన్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఎన్.పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కె.అచ్చెర్ల, మోసయ్యపేట, గోకవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. తాళ్లపాలెం ఎజిఎల్ ఫీడర్ పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు సమయాలు ఉదయం 4 నుంచి 9 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు మార్చినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి సవితను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అమరావతి సచివాలయంలో రాష్ట్ర బిసి మంత్రి సవితను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి జిల్లాలో బిసి భవనాలు, బిసి హాస్టళ్లలో మరమ్మతుల నిమిత్తం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. బిసిల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

లారీ సీజ్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో ఎన్.పేట గ్రామ పరిధిలో సోమవారం రాత్రి అక్రమంగా తరలుతున్న గ్రావెల్ లారీని స్థానిక పోలీసులు సీజ్ చేశారు. దాన్ని తహశీల్దార్‌కు అప్పగించినట్లు సిఐ స్వామినాయుడు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-మునగపాక : గ్రామంలోని అభివద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నెలకొల్పి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం దశమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు ఇవ్వాలనే సేవా దృక్పథంతో ఈ వాటర్ ప్లాంట్ నెలకొల్పడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్నవారికైనా లేనివారికైనా మంచి కార్యక్రమం చేపడితే దానిని గ్రామస్తులు స్వాగతించాలన్నారు. అనంతరం వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన పలువురని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, కాంగ్రేసుల నూకరాజు, బర్దం సూర్యనారాయణ, ఆడారి గణపతి అచ్చం నాయుడు, కొనపల్లి రామ్మోహన్‌రావు, పెంటకోట జగన్నాథం నాయుడు, రాజాన బుజ్జిబాబు, దాడి పోలీసు, ఆడారి సూర్యచంద్ర రామారావు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సమావేశం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక లక్ష్మీ కళా యూనియన్ రంగస్థల కళాకారుల సమావేశం భాగిరధి ఆలయం ఆవరణలో మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ రంగస్థల నటులు, దర్శకులు దాడి ముసలి నాయుడు మాట్లాడుతూ లక్ష్మీ కళా యూనియన్ రంగస్థల కళాకారులు గత 32 సంవత్సరాలుగా గ్రామంలోనే కాకుండా సంక్రాంతి, దసరా, శివరాత్రి, గ్రామదేవతల పండగల సందర్భాలలో వివిధ గ్రామాలలో నాటక, నాటిక ప్రదర్శనలు చేసి ప్రజా మన్ననలు పొందడం ప్రశంసనీయమన్నారు. పరిషత్ పోటీలలో తమ ప్రతిభను కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. అనంతరం లక్ష్మీ కళా యూనియన్ నూతన కమిటీ అధ్యక్షునిగా పెంటకోట శివాజీ, కార్యదర్శిగా పెంటకోట సత్యనారాయణ, కోశాధికారిగా ఆడారి సూర్యచంద్ర రామారావులను కళాకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దాడి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ, బుద్ధ నాగు, చదరం వెంకట సూరి అప్పారావు, దాడి వీర ,పెంటకోట సూరిబాబు, పెంటకోట శ్రీను, పక్కుర్తి కాశి, ప్రోత్సాహకులు ఆడారి మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ అనుపు ఉత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెంలో శ్రీ పరదేశిమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పసుపు కుంకుమ, చీరలు, మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి బైలపూడి దేముడు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంచకర్ల వెంకటేశ్వరరావును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కొటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతురాజు పాల్గొన్నారు.

బోరుబావుల మరమ్మతులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ఆధ్వర్యంలో మంగళవారం బోరు బావుల మరమ్మతు పనులు చేపట్టారు. కార్యక్రమానికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బండారు సతీష్, వెంకటరమణ, నారాయణమూర్తి, అప్పలకొండ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు అజయపురం గ్రామానికి తక్షణమే తాగు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ ఆదివాసీ గిరిజనులు మంగళవారం వినూత్న రీతిలో వాటర్ ట్యాంక్ ఎక్కి ఖాళీ బిందెలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా పాంగి జశ్వంతి, పాంగి చంద్రయ్య తదితరులు మాట్లాడుతూ, తమ గ్రామంలో సుమారు 30 కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తుమన్నారు. 2019 లో15 ఆర్థిక సంఘం నిధుల నుండి రూ 5 లక్షల నిధులు ఖర్చుపెట్టి గ్రామానికి కిలోమీటర్ల దూరంలో బోరు తీసి పైపు లైన్ ద్వారా అక్కడనుండి గ్రామానికి నీరు సరఫరా చేసారని తెలిపారు. ఇటీవల ఈ మోటర్ కాస్త ఖాలి పోవడంతో తాగునీరు సరఫరా కాలేదని వాపోయారు. తాగునిటీ కోసం కొండల నుంచి గెడ్డ ఊట నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు కిలోమీటర్లు దూరం నుండి తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 2023లో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ 15 లక్షల నిధులు మంజూరు చేశారని, వాటర్ ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా చేసి వదిలేసారని ఆరోపించారు. ఇంటింటికి కుళాయి పైపులు వేసి మధ్యలో వదిలేశారన్నారన్నారు. 2024 డిసెంబర్ తొలి వారంలో అజయ్ పురం గ్రామానికి రోడ్డు శంకుస్థాపనకి నిమిత్తం

నిరసన చేపడుతున్న గిరిజన మహిళలు, సిపిఎం నేతలు

వచ్చిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, గ్రామస్తులకు 15 రోజుల్లో పనులు పూర్తి చేసి తాగు నీరు అందజేస్తామని హామీ ఇచ్చారని, కానీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మర్మత్తుకు గురైన పాత మోటార్ ను వెంటనే రిపేర్ చేసి తాగు నీరు సరఫరా చేయాలని, అసంపూర్తిగా నిర్మాణం చేసిన వాటర్ ట్యాంకును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు, పాంగి శ్రీరామ, గిరిజన సంఘం జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

కూలీల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:ఉపాధి కూలీల బకాయి చెల్లించాలని రోలుగుంట మండలం కొంతలం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవిపిఎస్ నాయకులు బాలరాజు మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు పది వారాలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న కూలీలు

కార్డులను ఇస్తున్న టిడిపి నేతలు

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో కొమ్మిర గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె నూకి నాయుడు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వం కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. పార్టీలో క్రియాశీలకంగా ఆసక్తితో పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యులందరికీ ఈ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని నూకి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు కరణం ఈశ్వరరావు, బూతు ఇంచార్జ్ గొంతెన మోహన్ కృష్ణ, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ అన్నారు. మండలంలో ఉద్దండపురం ఆర్ఎస్‌కె కేంద్రలో సిబ్బంది మట్టి నమూనాలు తీసే విధానం పై అవగాహన కల్పించారు. గ్రామానికి 55 మట్టి నమూనాల చొప్పున సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. భూసార పరీక్ష ఆవశ్యకత గురించి వివరించారు. క్షేత్రస్థాయిలో భూములలో పర్యటించి మట్టి నమూనా సేకరించే విధానాన్ని తెలియజేశారు. పరీక్ష కేంద్రం నుండి వచ్చిన ఫలితాలనాధారంగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రైతులు భూసార పరీక్ష అనుగు ణంగా ఎరువులు యాజమాన్యం చేపట్టాలన్నారు. అనంతరం రైతులకు రాయితీ పై వ్యవసాయ స్ప్రేయర్స్ లు, వేసవి దుక్కులలో వేసుకోవడానికి అపరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, ఆర్ఎస్‌కె సిబ్బంది, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నర్సీపట్నం ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిమాపక అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. అనంతరం ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ: నేషనల్ ఫైర్ సర్వీస్ డే వారోత్సవాలను విశాఖపట్నం పోర్టు అథారిటీ, కేంద్ర అగ్నిమాపక స్టేషన్లో నిర్వహించారు. అగ్నిప్రమాదాలలో ప్రాణత్యాగం చేసిన ఫైర్‌మెన్‌కు స్మారక చిహ్నంగా, శిలాఫలకానికి పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పుష్పాంజలి ఘటించారు. పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫైర్ ఎక్విప్‌మెంట్, ఫొటో ప్రదర్శనలను అంగముత్తు తిలకించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణ అత్యంత ఆవశ్యకం అని ఆయన పేర్కొన్నారు. ఫైర్ ఆఫీసర్ కె.కుమార్‌రాజు మాట్లాడుతూ, ఈ ఏడాది "యూనిటీ టు ఇగ్నిటీ, ఎ ఫైర్ సేఫ్ ఇండియా" థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్నిసురక్షా కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బందికి పోర్టు చైర్మన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబె, చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్.స్వామి, డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తగరపువలస : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాల నివారణపై చిట్టివలస అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తగరపువలస జంక్షన్‌లో ఆ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు.అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలు, అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించి వివరించారు. ఇంట్లో, వంట గదిలో, దుకాణాల్లో, కర్మాగారాల్లో , గోదాముల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అనే అంశాలపై ప్రయోగాత్మకంగా చేసి చూపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. చిట్టివలస అగ్నిమాపకశాఖ అధికారి జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన

సబ్బవరం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఆర్‌టిసి కాంప్లెక్స్, సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో అగ్నిమాపక అధికారి జివి.సత్యరాజు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మ్యాన్ కె.అప్పలనాయుడు, ఎం.శ్యామ్ కుమార్, వి.ద్వారకాద్రి పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.అప్పారావు అన్నారు. గతపది రోజుల నుండి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెర్నె షిప్ ప్రోగ్రాం ద్వారా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ ఐటి/ఐటిఈఎస్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అప్పారావు వృతి విద్య కోర్సుల ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తివిద్య కోర్సు ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని అన్నారు. కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యా యులు యం.సాయి చందు, పి.విష్ణు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ రేవతమ్మ

విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల: విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నర్సీపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ తెలిపారు. మంగళవారం మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు, ఈ సందర్భంగా శక్తి యాప్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం

- ఎపి మత్స్యకార జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:కూటమి ప్రభుత్వంలో మత్స్య కారులకు గుర్తింపు కనిపించడం లేదని ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పిక్కి కోదండరావు ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయమే అజెండాగా పుట్టిన కూటమిలో సామాజిక న్యాయమే కొరవడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మత్స్యకారుల పాత్ర ఎంతో ఉందన్నారు. కూటమిలో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను సైతం ఒకే సామాజిక వర్గానికి కేటాయిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని, పార్టీ జెండాను మోసిన మత్స్యకార సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో మత్స్యకార గ్రామాల్లో వచ్చిన ఓట్లను పరిగణంలోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫోరెన్సిక్ అధికారులు

బాణసంచా కేంద్రాలను నిశితంగా పరిశీలిస్తాం

ప్రజాశక్తి -కోటవురట్ల: జిల్లాలో బాణసంచా కేంద్రాలను నిశితంగా పరిశీలిస్తామని ఫోరెన్సిక్ ఫైర్ చీఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి నీలేస్ కుకుండే తెలిపారు. మంగళవారం ఆయన పేలుడు సంభవించిన విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రాన్ని, ఎండపల్లిలో వెంకటేశ్వర రాజా ఫైర్ వర్క్స్ కేంద్రాలను సందర్శించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎండపల్లి వద్ద నిర్వహిస్తున్న బాణాసంచా కేంద్రం పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రమాదానికి గల కారణాలను నిశితంగా పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది పనిచేయాల్సి ఉంది, ప్రమాదం జరిగిన రోజు ఎంతమంది పనిచేశారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు తిరుమల బాబు, ఎస్సై రమేష్, ఆర్ఐ వర్ధనరావు సీనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'గీతం' వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-మధురవాడ : గత ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభించిన 'టెక్నాలజీ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ (టెప్)' కోర్సులో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమలోని వినూత్న ఆలోచనలను ఆకర్షణీయమైన ఉత్పత్తుల రూపంలోకి మార్చి మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అబ్బురపరిచింది. విద్యార్థులు అధునాతన ఉపకరణాలతో పాటు 3డి ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, గ్రైండింగ్ పద్ధతులు ఉపయోగించి ఇనుము, ప్లాస్టిక్‌లు, చెక్కతో సాంకేతిక ఉత్పత్తులను రూపొందించి యువ ఆలోచనలను చాటిచెప్పారు. దాదాపు 160 మంది గీతం ఇంజనీరింగ్ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి దాదాపు 50కి పైగా సాంకేతిక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

అగ్ని ప్రమాదాలలో రక్షించే రోబోట్, అంధులకు మార్గం చూపించే పరికరాలు, వికలాంగులకు ఆధునిక వీల్‌ఛైర్, ఆకర్షణీయ వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు, తీర ప్రాంతాల పరిశుభ్రతకు ఉపయోగించే యంత్రాలు, వరదముప్పును గుర్తించే పరికరాలు, స్మార్ట్ పార్కింగ్, సౌర యంత్రాలను శుభ్రపరిచే సామగ్రి, చేతి సంజ్ఞల ఆధారంగా పనిచేసే రోబోట్‌లు, వైద్య రంగంలో ఉపయోగపడే రోబో చేతి నమూనా, నదులలో వ్యర్థాలను శుభ్రపరిచే యంత్రాలను ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు తమ కోర్సులో నేర్చుకున్న అంశాల ఆధారంగా సెన్సార్‌లు, మోటార్‌లు, మైక్రో కంట్రోలర్‌లను తప్పనిసరిగా ఉపయోగిస్తూ అవసరమైన చోట 3డి ప్రింటింగ్ ద్వారా తమ సాంకేతిక నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.

గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు తిలకించి, విద్యార్థులను అభినందించారు. ఉత్తమ నమూనాలకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గీతం ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి, నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌ను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మధురవాడకు చెందిన నిండు గర్భిణి అనూషను కడతేర్చిన భర్త జ్ఞానేశ్వర్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. ఈ మేరకు కెజిహెచ్ మార్చురీ వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విశాఖలో ఇంత దారుణ సంఘటన జరిగినప్పటికీ హోం మంత్రి స్పందించకపోవడం దారుణం అన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి

- ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించడాన్ని ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఈ చట్టం రాజ్యాంగంపై, మైనారిటీల హక్కులపై దాడి చేస్తోందని, దేశ లౌకిక కూర్పును దెబ్బతీస్తూ, మతపరంగా చీలికలను పెంచుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది.

ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అ్రష్ఫ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం సంఘాలు, మసీదు పెద్దలు మున్నీరు, అహ్మద్‌ఖాన్, అబిద్ బేగం, ఎదీన్, మున్నీషాలతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

గతంలో ఉన్న వక్ఫ్ చట్టం, వక్ఫ్ ఆస్తుల (ఇస్లామిక్ దానధర్మాలు) నిర్వహణకు సంబంధించి చట్టబద్ధమైన చట్ర పరిధిని కలిగివుందని, ఆ ఆస్తుల సక్రమ నిర్వహణకు, రక్షణ హామీ కల్పిస్తోందని, మతపరమైన, దాతృత్వ సంబంధమైన ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని, వక్ఫ్ ఆస్తుల క్రమబద్ధీకరణకు, వాటి దుర్వినియోగాన్ని, అనధికారిక విక్రయాలను నివారించేందుకు మార్గదర్శకాలను అందిస్తోందని సమావేశం పేర్కొంది. సవరించిన చట్టంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని, ఈ మార్పులు గత చట్టంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాయని తెలిపింది. ఈ సవరణ ద్వారా బిజెపి ప్రభుత్వం ప్రజలను చీల్చడానికి ఉద్దేశించిన హిందూత్వ ఎజెండాను ముందుకు తెస్తోందని సమావేశం అభిప్రాయపడింది. ముస్లిములు విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకోవడానికి గత చట్టాన్ని ఉపయోగించుకున్నారంటూ పదే పదే చెబుతోందని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుండి ముస్లిమేతరులను నిషేధించాలని, ఇస్లామిక్ ఆదేశాలు ఉన్నప్పటికీ సవరించిన చట్టం ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుల్లో చేర్చిందని, ఇది, మతాన్ని ఆచరించుకునేందుకు ముస్లింలకు గల రాజ్యాంగ హక్కుపై దాడి చేయడమేనని సమావేశం పేర్కొంది. కనీసం ఐదేళ్లుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నట్లు ముస్లిం రుజువు చేసుకోవడం తప్పనిసరి చేయడం ద్వారా సవరించిన చట్టం ముస్లిములను వేధించడానికి మార్గాన్ని సుగమం చేసిందని, మసీదులు తదితరాల నిర్మాణానికి అనేకమంది ముస్లిం యేతరులు కూడా సేవలందించారని, సవరించిన చట్టం కింద ఇక ఈ సోదర భావం, సౌభ్రాతృత్వం ప్రదర్శించడం సాధ్యం కాదని సమావేశం తెలిపింది.

వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40ని రద్దు చేయడంతో ఆస్తుల స్వభావాన్ని నిర్ణయించేందుకు గల అధికారాన్ని వక్ఫ్ బోర్డు కోల్పోనుందని తెలిపింది. దేశంలోని మెజారిటీ వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుందని సమావేశం పేర్కొంది. వక్ఫ్ ఆస్తులను నిర్ధారించే అధికారాన్ని సర్వే కమిషనర్ నుంచి ప్రభుత్వం నియమించిన రెవెన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తివిద్యా కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందని సమావేశంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. తద్వారా వక్ఫ్ ఆస్తులపై పట్టును కేంద్ర ప్రభుత్వం మరింత పెంచుకోనుందని తెలిపారు. దీర్ఘకాల వినియోగం ద్వారా చారిత్రకంగా వక్ఫ్ ఆస్తులుగా భావిస్తున్న వాటిని రిజిస్ట్రేషన్ చేయాలన్న కొత్త ఆదేశం వాటిని జప్తు చేయాలనే ప్రభుత్వ రహస్య ఎజెండాను బట్టబయలు చేస్తోందన్నారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌కు గల అధికారాలను రద్దు చేయడం ద్వారా వక్ఫ్ బోర్డు తాను సేవలందించే కమ్యూనిటీకి దూరమైపోతుందన్నారు. ఈ సవరణల ద్వారా ముస్లిముల హక్కులను రద్దు చేయాలన్న తన ఎజెండాను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ప్రత్యేక ఉద్దేశాన్ని ఇది ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. దేశ లౌకిక, ప్రజాతంత్ర కూర్పును పరిరక్షించేందుకు లౌకికవాదులు, ప్రజాస్వామ్య భావజాలం కలిగిన పౌరులందరూ ఈ విచ్ఛిన్నకరమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేసేందుకు ఒక్క తాటిపైకి కలిసి రావాలని సమావేశం పిలుపునిచ్చింది.

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి :సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ విజ్ఞప్తి చేశారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, 19వ తేదీన జరగనున్న సదస్సుకు ముఖ్యవక్తగా సిఐటియు అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రైల్వే యూనియన్ నాయకులు వి.ఉమామహేశ్వరరావు, ఇతర ఫెడరేషన్ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రజల సంపదైన రైల్వేలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రయివేటీకరణ విధానాలను అతి దూకుడుగా అమలుపరుస్తుందన్నారు. రైల్వేలో అత్యంత కీలక విభాగాలైన సిగ్నలింగ్ టెలికమ్యూనికేషన్, రైల్వే ట్రాక్ మెయింటినెన్స్, ఇంజినీరింగ్, ఆపరేటింగ్, మెకానికల్ తదితరాలను ప్రయివేటీకరణ చేసిందన్నారు. ప్రమాదాల నివారణకు రైల్వే టాస్క్‌ఫోర్స్ కమిటీ, కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్), రైల్వే సేఫ్టీ కమిటీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు అనేక సూచనలతో రిపోర్టులను ప్రభుత్వానికి గత 7 సంవత్సరాల క్రితమే సమర్పించారని, వీటిని ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. రైల్వేలో భద్రతా చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు సక్రమంగా కేటాయించడం లేదని, దీంతో ప్రమాదాలు పెరగాటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోందన్నారు. లోకో రన్నింగ్ లోకో పైలెట్లు, అసిస్టెంట్ పైలెట్లచే రోజుకు 14 గంటలకు పైబడి పనిచేయించుకోవటం, వారాంతపు సెలవులు, తగు విశ్రాంతి దొరక్క రన్నింగ్ స్టాఫ్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.

అధిక ఆదాయం ఆర్జిస్తున్న రైల్వేలను కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారుల లాభాల కోసం ప్రైవేటీకరించి, అప్పచెప్పటం ప్రజావ్యతిరేకచర్య అన్నారు. పేద, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా రైళ్లను పెంచడంలేదన్నారు. అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజలందరూ ఈ సదస్సులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి -రావికమతం :ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని రకాల ప్రభుత్వ సేవలు వాట్సప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి వచ్చాయని ఎంపిడిఓ కే.వెంకన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే చేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని ప్రభుత్వ సేవలు, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు, నిర్ణీత సమయానికి అందుతాయన్నారు. దీనికోసం ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరు 9552300009 నెంబర్తో అనుసంధానం చేసుకోవాలన్నారు. దీని ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఓటీపీ నెంబర్లు ఇతరులకు తెలుపవద్దని సూచించారు. మహిళలందరూ శక్తి యాప్ ఇన్ స్టాల్ చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, పొన్నవోలు ఎంపీటీసీ పులగాయల సత్యనారాయణ, సూపరెంటెంట్ స్వామి , పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో ప్రచారం చేస్తున్న అధికారులు

మాడుగుల:రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి చరవాణిలో సేవలు అందించాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం మన మిత్ర అని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలోని మంగళవారం పలు గ్రామాల్లో సచివాలయం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన మిత్ర యాప్ ఫోన్ నెంబర్ 9552300009కు ప్రతి ఒక్కరు ఫోన్లో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. హాయ్ అనండి హాయిగా సేవలు పొందండి కరపత్రాలను అందరికి అందజేశారు

మేరీ సువార్తకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం సీడీపీవో మేరీ సువార్త క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. డిసెంబర్ 1న నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో మేరీ సువార్త పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో జరిగిన మ్యూజిక్ ప్రదర్శనలో ఆమె గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఈ నెల 14న జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా సిడిపిఒను పలువురు అభినందించారు.

సర్టిఫికెట్‌ను అందుకుంటున్న మేరీ